# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 189

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy    సంపాదకులు : కె.భాస్కర్‌రావు    రూ.2.00/- పేజీలు 8    తేది: శుక్రవారం 07 ఆగష్టు 2026








ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు.

**సమయం ప్రతినిధి:** ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది.

**నన్ను ఎవరూ ఆపలేరు: రాహుల్**

'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయించుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు.




విమాన ఇంధనంలో ఇథనాల్ కలిపే ప్రసక్తే లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తేల్చి చెప్పారు. ఇథనాల్ కలుపుతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల్లో అనవసర ఆందోళనలు కలిగించేలా బాధ్యతారాహిత్యంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** విమాన ఇంధనంలో ఇథనాల్ బ్లెండింగ్ చేపడుతున్నారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఇథనాల్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (SAF) పూర్తిగా వేరని, రెండింటికి ఎలాంటి సంబంధం లేదని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఇథనాల్‌ను విమాన ఇంధనంగా ఉపయోగించడం లేదని, ఎస్ఏఎఫ్ అనేది అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా తయారు చేసే ప్రత్యామ్నాయ విమాన ఇంధనమని వివరించారు. ప్రయాణికుల భద్రతే కేంద్ర ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని రామ్మోహన్ నాయుడు పునరుద్ఘాటించారు. విమానయాన భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అన్ని నిర్ణయాలు అత్యున్నత భద్రతా ప్రమాణాల మేరకే తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ కూడా కీలక ప్రకటన విడుదల చేసింది. విమాన ఇంధనంలో ఇథనాల్ కలుపుతున్నారనే ప్రచారాన్ని ఆ శాఖ ఖండించింది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ICAO) ఆమోదించిన కఠినమైన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగానే సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ ఉందని పేర్కొంది. విమానయాన భద్రతకు సంబంధించిన అంశాలపై నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, అసత్య ప్రచారాలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేసింది.




రోజువారీ సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం అండగా మారుతోంది. పూచీకత్తు లేకుండానే బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ చిరు వ్యాపారుల కు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. కరోనా సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వీధివ్యాపారులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రారంభించిన ఈ పథకాన్ని ఇప్పుడు 2030 మార్చి 31వరకు పొడి గించింది.

**సమయం ప్రతినిధి:** మెప్మా ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ పథకం ద్వారా వేలాది మంది వ్యాపారులు తమ వ్యాపా రాన్ని నిలబెట్టుకోవడంతో పాటు విస్తరించు కునే అవకాశం పొందుతున్నారు.

**2,618మంది గుర్తింపు..**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 2,618 మంది చిరువ్యాపారులను గుర్తించారు. వీరిలో 344మంది 15వేల రూపాయలు, 1,486మంది 25వేల రూ పాయలు, 768మంది 50వేల రూపా యల చొప్పున రుణాలు తీసుకున్నారు. 20మందికి క్రెడిట్ కార్డులు వచ్చాయి. మొదటి విడుతలో 15వేల రూపాయ లు అందిస్తారు. సకాలంలో తిరిగి చెల్లిస్తే రెండో విడతలో 25వేల రూపాయల రుణం పొందే అవకాశం ఉంటుంది. రెండో విడత రుణాన్ని నిర్ణీత గడువులో చెల్లించిన వారికి .50వేల రూపాయల వరకు రుణం అందిస్తున్నారు. ఈ విధంగా క్రమశిక్షణతో రుణాలు చెల్లించే వారికి మరింత ఆర్థిక సహాయం అందేలా కేంద్ర ప్రభుత్వం పథకాన్ని రూపొందించింది.

**అవగాహన లేకపోవడంతో..**

మున్సిపల్ పరిధిలో 2,618మంది వీధి వ్యాపారులుగా గుర్తిం పు పొందగా, అందులో కేవలం 20మందికి మాత్రమే క్రెడిట్ కార్డులు లభించాయి. అర్హులైన వ్యాపారుల్లో చాలా మందికి పథకంపై పూర్తి అవగా హన లేకపోవడం, బ్యాంకు ప్రక్రియలపై సందేహాలు ఉండటం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. అధికారు లు అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తే మరింత లబ్ధిపొందే అవకాశం ఉంది.

**ఆర్థికంగా నిలదొక్కుకునేలా..**

చిన్న మొత్తంలో పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తీసుకునే పరిస్థితిని పీఎం స్వనిధి పథకం గణనీయంగా తగ్గిస్తోంది. అయితే పథకం అసలు లక్ష్యం నెరవేరాలంటే అర్హులైన ప్రతి వీధి వ్యాపారికి గుర్తింపు కార్డు, రుణం, డిజిటల్ లావాదేవీలపై అవ గాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పథకం పొడిగింపుతో ఇంకా వేలాది మంది చిరు వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభించింది. దీనిని సద్వినియోగం చేసుకుంటే చిన్న వ్యాపారాలే పెద్ద విజయాలకు పునాది కావచ్చు.

**క్రెడిట్ చరిత్రకే ప్రాధాన్యం..**

పీఎం స్వనిధి పథకం ప్రత్యేకత రుణం ఇవ్వడంలోనే కాదు, ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడంలోనూ ఉంది. రుణాలను సకా లంలో చెల్లించే వారికి సిబిల్ స్కోర్ మెరుగు పడుతుంది. దీంతో భవిష్యత్తులో వ్యక్తిగత రుణాలు, ఇతర బ్యాంకు సేవలు పొందడం సులభమవుతుంది. కొందరు అర్హులైన వ్యాపా రులకు క్రెడిట్ కార్డులు కూడా మంజూరు అవుతున్నాయి. రుణాలను క్రమం తప్పకుండా చెల్లించే వారికి ఇది అదనపు ప్రయోజనంగా నిలుస్తోంది.

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆ పాఠశాలకు నూతన సొబగులు



**ఖమ్మం జిల్లా, ఆగస్టు 6, సమయం ప్రతినిధి:** ఖమ్మం జిల్లాలోని గోపాలపురం పాఠశాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (Telangana CM Revanth Reddy) అండగా నిలబడ్డారు. ఆ పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఖమ్మం కలెక్టర్ దివాకర్ పాఠశాలను సందర్శించారు.

ఉపాధ్యాయిని ఇందిరతో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడారు. శిథిల భవనాల స్థానంలో కొత్త తరగతి గదులు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయినిని అధికారులు అభినందిం చారు. సీఎం ఆదేశాలతో వెంటనే నిధుల విడుదల చేశారు. ఈ నిధులతో గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పథంలో కొనసాగనుంది.

## ప్రభుత్వ భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలి

**జడ్చర్ల, ఆగస్టు 6, సమయం ప్రతినిధి:** జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లిలో ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనం లోకి మార్చాలని జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జాతీయ రహదారి-44కు ఆనుకుని ఉన్న పాత మున్సిపల్ కార్యాలయ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉందని, ప్రభుత్వం సొంత భవనాల్లోనే కార్యాలయాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఈ భవనంలోకి తరలించాలని ఈ భవనం విశాలమైన పార్కింగ్ సదుపాయం, రవాణా సౌకర్యాలు, జాతీయ రహదారికి సమీపంలో ఉండటం వల్ల ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని వివరించారు. కార్యాలయం ఇక్కడికి మారితే ప్రజలకు సేవలు మరింత సులభంగా అందడంతో పాటు ఆ ప్రాంతంలో ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు కూడా పెరిగి అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



## పెండింగ్ ఫైళ్ల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా






**మహబూబ్‌నగర్, ఆగస్టు 6 (సమయం ప్రతినిధి):** కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ప్రజావాణి, ఆర్‌టీఐ దరఖాస్తులు, కోర్టు కేసుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె కీలక సూచనలు చేశారు.ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలను నిబంధనలకు అనుగుణంగా పూర్తి బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఫైళ్లను పరిశీలించే సమయంలో సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు, మార్గదర్శకాలను అధ్యయనం చేసి స్పష్టమైన అభిప్రాయంతో ఫైల్ సమర్పించాలని తెలిపారు. సందేహాలు ఉంటే సంబంధిత అధికారులతో లేదా తనతో చర్చించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.కార్యాలయ పనివేళల్లో సమయపాలన పాటిస్తూ బయోమెట్రిక్ హాజరు నమోదు తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి తన శాఖకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాత దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కొత్త ఫైళ్లను ముందుగా పరిష్కరించడం సరికాదని పేర్కొన్న కలెక్టర్, ముందుగా వచ్చిన దరఖాస్తులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి చొరవ చూపే ఉద్యోగులను తాను గమనిస్తున్నానని, కలెక్టరేట్‌కు ఉద్యోగులే వెన్నెముక అని, వారి సమర్థవంతమైన పనితీరుతోనే కార్యాలయానికి మంచి పేరు వస్తుందని అన్నారు.

**ప్రజావాణి, ఆర్‌టీఐ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించి దరఖాస్తుదారులకు త్వరగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. తహసీల్దార్ లేదా ఇతర శాఖలకు పంపాల్సిన దరఖాస్తులను వెంటనే ఫార్వర్డ్ చేయాలని సూచించారు. ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో కూడా జాప్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతివాదిగా ఉన్న కోర్టు కేసుల్లో సంబంధిత శాఖలు వెంటనే కౌంటర్ దాఖలు చేసి దాని ప్రతిని సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్‌ను ఏదైనా కేసులో పార్టీగా చేర్చిన వెంటనే పరిపాలన అధికారికి సమాచారం ఇవ్వాలని, కోర్టులో దాఖలు చేసిన అన్ని పత్రాల ప్రతులను సంబంధిత సెక్షన్‌లో రికార్డుగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణ రాజు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పొంచివున్న నైపుణ్యాల సంక్షోభం

ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఆందోళనలు ఉవ్వెత్తున ఎగసి విస్తరించటం దేశాన్ని నివ్వెరపరిచింది. 'నీట్' పరీక్షాపత్రం లీక్ పట్ల ఆగ్రహంగా మొదలైన యువత నిరసన.. చివరకు పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక నిరాశా నిస్పృహల పట్ల ప్రతిఘటనోద్యమంగా పరిణమించింది. డిగ్రీలున్నా ఉద్యోగాలు రాకపోవటం, ఆకాంక్షలు పెరుగుతున్నా తగినంతగా అవకాశాలు లేకపోవటం యువతను తిరగబడేలా చేసింది. ప్రవేశ పరీక్షాపత్రం లీకవటం యువతను సమీకరించే ఒక నిప్పురవ్వ మాత్రమే. దాని వెనక దాగివున్న సంక్షోభం నిజమైనది, సంక్లిష్టమైనది. పాఠశాలల్లో కావచ్చు, కాలేజీల్లో కావచ్చు.. మన విద్యావ్యవస్థ చాలామేర కుప్పకూలింది. పిల్లల్లో 80శాతం మంది స్కూలు విద్యలో పాసవుతున్నారు కానీ, వారికి చదువులో ఎటువంటి నిజమైన పునాదీ ఉండటం లేదు. ఇందులో వారి తప్పు కూడా ఏమీ లేదు. బట్టీపట్టటం ద్వారా నేర్చుకోవటం, మూకుమ్మడి కాపీయింగ్‌లతో పాసవటం అనే అవ్యవస్థ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. రెండోది, విద్యార్థులు ఏం నేర్చుకున్నారో బేరీజు వేసే పరీక్షా పద్ధతులు అర్థరహితంగా ఉండటంతో.. అత్యధిక శాతం ఆరాటపడే 'స్టెమ్' (సైన్స్-టెక్నాలజీ-ఇంజినీరింగ్-మ్యాథ్స్) కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేకంగా పోటీ ప్రవేశ పరీక్షలు అవసరమయ్యాయి. మూడోది, చాలా సందర్భాల్లో రాష్ట్రాలు నిర్వహించే పరీక్షా పద్ధతుల్లో విశ్వసనీయత లోపిస్తోంది. బోర్డు ప్రమాణాల్లో రాష్ట్రాల మధ్య భారీ అంతరం ఉంటోంది. దీంతో, ప్రామాణిక, నిష్పాక్షిక, న్యాయమైన బేరీజు కోసం దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష అవసరమవుతోంది. నాలుగోది, వైద్య కళాశాలలు పుట్టగొడుగుల్లా పెరిగినప్పటికీ, ఎంపిక చేసిన కొన్ని కళాశాలలు మాత్రమే యువ మెడికోలకు కనీస ప్రమాణాల శిక్షణను అందించగలుగుతున్నాయి. కాబట్టి, లక్షలాది మందికి వైద్య కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నా, మెరుగైన కొన్ని కళాశాలలకే డిమాండ్ ఉంది. వాటిల్లో చేరేందుకు ఉత్తమ ర్యాంకుల కోసం విపరీత పోటీ ఉంటోంది. అయిదోది, మెడికల్ పోటీ ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసే డిమాండ్‌కు అనుగుణంగా అనేక కోచింగ్ సెంటర్లు వెలిశాయి. పదవ తరగతి తర్వాత శిక్షణ-- చదువును విభాగాలవారీ ప్యాకేజీలతో అందించనారంభించాయి. పోటీ, పాఠశాల పునాదులు బలహీనంగా ఉండటం వల్ల.. ఆ రెండేళ్లపాటు యువ విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇంత మితిమీరిన ఒత్తిడి వాతావరణంలో, పరీక్షా పత్రం లీక్ అయిందంటే-- అది యువతకు, వారి తల్లిదండ్రులకు శరాఘాతమే. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్ అంతటి అలజడికి దారితీయటంలో ఆశ్చర్యమేమీ లేదు. విద్యార్థులు, తల్లిదండ్రుల బాధను గ్రహించి కేంద్ర ప్రభుత్వం సహానుభూతితో సకాలంలో బలంగా స్పందించి ఉండాల్సింది. రాజకీయంగా సున్నితంగా వారితో కూర్చుని మాట్లాడాల్సింది. అలాగాక, సవాలక్ష సమస్యల్లో ఇదొకటి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది. భారీఎత్తున యువత స్వచ్ఛందంగా తరలివచ్చే ఓ ఉద్యమానికి నిప్పురవ్వ రాజుకుంటోందని అంచనా వేయలేకపోయింది. అధికారాన్వేషణలో మునిగితేలే మనలాంటి సమాజంలో ఇలాంటి తక్షణ రాజకీయ పర్యవసానాలు రసవత్తరంగా అనిపిస్తాయిగానీ, మనం ఆ నిప్పురవ్వను దాటి ఆలోచించాలి. ఏమాత్రం ఆజ్యం తగిలినా ఓ పెద్ద విస్ఫోటనానికి దారితీసే మూలాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. మన 'విద్య-నైపుణ్యాలు- ఉపాధి అవకాశాల' అభివృద్ధి వలయాన్ని దెబ్బతీసే ఒక లోతైన సంక్షోభం అందులో దాగివుంది. ప్రస్తుతం మన దేశంలో ప్రతిష్ఠాత్మక కోర్సుల్లో చేరుతున్నవారికి కూడా నైపుణ్యాలు ఉండటం లేదు. ఉద్యోగాల్లోకి తీసుకోవటానికి చాలామందికి తగిన నైపుణ్యాలు లేవు. 13.5 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 15-20శాతం మందికే ఉద్యోగాలకు తగిన కనీస నైపుణ్యాలున్నాయని అంచనా. ఏళ్ల తరబడి కాలేజీల్లో చదువుకున్నాక, ఒక విలువ లేని డిగ్రీతో యువత బయటకు వస్తున్నారు. వైద్య గ్రాడ్యుయేట్లకు కూడా శిక్షణ అరకొరగా ఉంటోంది. పట్టభద్రుల సంఖ్యతో పొంతన లేకుండా వైద్య పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు అతితక్కువ సంఖ్యలో ఉండటంతో, అందులో చేరగలగటం భగీరథ ప్రయత్నంలా మారుతోంది. ఎలాగోలా మరో ప్రవేశపరీక్షలో నెగ్గి, పోస్టుగ్రాడ్యుయేట్ శిక్షణ తీసుకున్న తర్వాత కూడా, వైద్య వృత్తి ప్రాక్టీస్‌కి తగిన నైపుణ్యాలు, నమ్మకం కోసం పేరొందిన వైద్య నిపుణుల వద్ద కొన్నేళ్లపాటు సహాయకులుగా పనిచేయాల్సి వస్తుంది. ఎంతో విలువైనవిగా భావించే 'స్టెమ్' కోర్సుల పరిస్థితే ఇంత ఇబ్బందికరంగా ఉంటే, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఏటా చేరే సుమారు 90లక్షల మంది విద్యార్థుల పరిస్థితేమిటో ఊహించుకోవచ్చు.

ఉద్యోగ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారిపోతోంది. యూనివర్సిటీ డిగ్రీలు అంతేవేగంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. ఈ చదువులోనూ అత్తెసరు ప్రమాణాలుంటే.. ఇక ఆ దుస్థితికి అంతుండదు. కాబట్టి, నైపుణ్యాల అంతరం అనేది మనం తక్షణం దృష్టి సారించాల్సిన అంశం. ఏ ఆధునిక ఆర్థిక వ్యవస్థకయినా అత్యున్నత నైపుణ్యాలున్న టెక్నోక్రాట్లు పరిమిత సంఖ్యలోను, నైపుణ్యాలున్న శ్రామిక ఉద్యోగులు పెద్దసంఖ్యలోను అవసరం. కానీ భారత్‌లో ఆ పిరమిడ్ తలకిందులుగా ఉంది. భారత్‌లో కేవలం 50శాతం ఐ.టి.ఐ సీట్లు భర్తీ అవుతున్నాయి. కొద్దిమంది యువత మాత్రమే ఐ.టి.ఐల్లో చేరుతున్నారు (సుమారు 13.20 లక్షలు). పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ఇంకా తక్కువమంది (సుమారు 6.4 లక్షలు) విద్యార్థులు నమోదు చేసుకుంటున్నారు. ఇంజినీరింగ్‌లో చేరేవారితో (13.54 లక్షలు) పోలిస్తే, వారి సంఖ్య అలా తక్కువగా ఉండటం ఏ అభివృద్ధి చెందిన దేశంలోనూ కనిపించని సరళి. ఈ కోర్సులన్నిటిలోనూ ఎక్కువమంది విద్యార్థులు నిజమైన నైపుణ్యాలు, ఉత్పాదకత లేకుండా కేవలం సర్టిఫికెట్లు, డిగ్రీలు అందుకుంటారు. చైనా ప్రతి సంవత్సరం 16.62 లక్షల మంది ఇంజినీర్లకు అద్భుతమైన శిక్షణనిస్తుంది. వారంతా నిజమైన టెక్నోక్రాట్లు, నైపుణ్యాలున్న ఇంజినీర్లు. అదేవిధంగా, ఆ దేశం వృత్తి విద్యలో 56.40 లక్షల యువతకు నిజమైన నైపుణ్యాల్ని అందిస్తుంది. చైనాలో పాఠశాల విద్య పునాదులు కూడా చాలా ప్రామాణికంగా ఉన్నాయి. మనం స్కూళ్లు, కళాశాలలను దాదాపు అందరికీ అందుబాటులోకి విస్తరించాం. కానీ కొన్ని ఖరీదైన విద్యాసంస్థల్లో తప్ప, చాలా సందర్భాల్లో చదువుల నాణ్యత అధ్వానంగా ఉంటోంది. ఈ మొత్తంలో బాధితులు-- మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులు, తల్లిదండ్రులు. సంపదసృష్టిలో 'జెన్ జీ'కి నిజమైన అవకాశం లభించాలంటే, మన విద్యను, నైపుణ్యాల అభివృద్ధిని సమూలంగా మార్చుకోవాలి. ఆపైన సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలను సృష్టించటానికి మనం చేయాల్సింది చాలా ఉంది. అది వేరే చర్చ. నిశితంగా పరిశీలించే ప్రతి ఒక్కరికీ విద్యారంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం గురించి తెలుసు. యువ జనాభాపరంగా మనకున్న అద్భుతావకాశాల్ని మనం వృథా చేసుకుంటున్నాం. ఆ అవకాశం ఎల్లకాలం కొనసాగదు. త్వరలో ముగుస్తుంది. త్వరపడి, దృఢ సంకల్పంతో వ్యవహరిస్తేనే అవకాశాన్ని మనం సద్వినియోగం గావించుకోగలం. రాజకీయంగా ఒక స్థూల ఏకాభిప్రాయానికి రావాల్సిన అంశమిది. ఎందుకంటే, ప్రతి పార్టీకీ ఇందులో గరిష్ఠ వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనం దాగివుంది. విద్యను నియంత్రించేది రాష్ట్రాలు కాబట్టి, ఎక్కువ కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుంది. రాజకీయాలు, పరిపాలన, పౌర సమాజం, మీడియా, విద్యారంగంలోని మనమంతా సంఘటితమై నిర్మాణాత్మక, సృజనాత్మక పరిష్కారంతో ఈ సంక్షోభంపై స్పందించాల్సి ఉంది. ఆయాసం తప్ప ఫలితంలేని పడికట్టు పదాలకు, చేసిన తప్పుల్నే మళ్లీ మళ్లీ చేసే యథాతథ పాలనా ధోరణికి ఇక కాలం చెల్లింది. మనం ఈ సవాలుకు దీటుగా, యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ సంక్షోభం మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్ని, సమాజాన్ని కమ్మేస్తుంది. మన భవిష్యత్తును కుంగదీస్తుంది.

## చేనేత మహిళా కార్మికల జీవితాల్లో వెలుగులు నింపాలి- ఎంపీ డీకే అరుణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 6 (సమయం ప్రతినిధి):** టెక్స్‌టైల్, హ్యాండ్లూమ్ (చేనేత, జౌళి) రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ అనెక్స్ భవనంలో జరిగిన మహిళ సాధికారత పార్లమెంటరీ కమిటీ ఉన్నతస్థాయి సమావేశానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత, జౌళి రంగ మహిళా కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో చేనేత, జౌళి పరిశ్రమల్లో శ్రమిస్తున్న మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లను సమగ్రంగా చర్చించారు. ఈ రంగానికి చెందిన నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని మహిళల ఆర్థిక, ఆరోగ్య, సామాజిక సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, చేనేత మగ్గాలపై గంటల తరబడి పనిచేయడం వల్ల మహిళలు తీవ్రమైన వెన్నునొప్పి, కంటి సమస్యలతో బాధపడుతున్నారని, వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. దళారీల వ్యవస్థను అరికట్టి, మహిళా చేనేత కార్మికులకు నేరుగా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు ముడిసరుకుపై రాయితీలు అందించాలని సూచించారు. అలాగే శ్రమను తగ్గించే ఆధునిక మగ్గాలు, పరికరాల వినియోగంపై మహిళలకు ప్రత్యేక శిక్షణ అందించాలని అన్నారు. తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ప్రాంతాల్లో వేలాది మంది మహిళలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి మరింత వేగంగా



అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ డీకే అరుణ కోరారు. మహిళా కార్మికుల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీ ద్వారా వారి సమస్యలను అధ్యయనం చేస్తోందని, మహిళా నేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘన ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, ఆగస్టు 6:** ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో టెంట్ల ఏర్పాటు, వీఐపీ సీటింగ్, ప్రధాన వేదిక నిర్మాణం, అధికారులు, ప్రజాప్రతినిధుల సీటింగ్ ఏర్పాట్లు, పరేడ్ నిర్వహణ విధానం, కార్యక్రమాల ప్రారంభ క్రమం, శకటాల ప్రదర్శన, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించిన జిల్లా కలెక్టర్, అవసరమైన చోట మార్పులు చేసి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు.

## నాంపల్లి టూ లక్డీ కపూల్ వై ఆకారంలో బ్రిడ్జి

హైదరాబాద్ : హైదరాబాద్ నడిబొడ్డున ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ నిర్మాణం కానుంది. నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ డీపీఆర్ రెడీ చేస్తోంది. 1.45 కిలోమీటర్ల పొడవుతో 3 లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌ను అసెంబ్లీ వెనుక నుంచి నిర్మించనుండగా.. లక్డీకాపూల్ వద్ద ఇది మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ వైపులకు విడిపోయేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర కోర్ ఏరియాలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందిహైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కోర్ సిటీలో వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తుది దశకు చేరుకుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఫ్లైఓవర్ నాంపల్లిలోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ సమీపం నుంచి పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ వెనుక భాగం మీదుగా రైల్వే ట్రాక్ వెంట లక్డీకాపూల్ వరకు నిర్మించనున్నారు. మొత్తం 1.45 కిలోమీటర్ల పొడవుతో మూడు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌గా దీన్ని డిజైన్ చేస్తున్నారు. లక్డీకాపూల్ చేరుకున్న తర్వాత ఫ్లైఓవర్ 2 మార్గాలుగా విడిపోయి వై ఆకారాన్ని సంతరించుకోనుంది. ఇందులో ఒక శాఖ దాదాపు 400 మీటర్ల మేర 2 లేన్లతో మాసబ్‌ట్యాంక్ వైపు ఇప్పటికే ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానం కానుండగా.. మరో శాఖ సుమారు 530 మీటర్ల మేర 2 లేన్లతో ఖైరతాబాద్ వైపు రోడ్డుకు కలుస్తుంది. దీంతో నాంపల్లి నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగకుండా నేరుగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో 3 ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్లు ఉండటంతో రోజంతా తీవ్ర ట్రాఫిక్ నెలకొంటోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో ట్రాఫిక్ ఆంక్షల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం ట్రాఫిక్ ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ట్రాఫిక్ అంచనాల కోసం ప్రత్యేక కన్సల్టెన్సీ సంస్థతో సర్వే నిర్వహించగా.. ప్రస్తుతం టోపోగ్రఫీ సర్వే తుది దశలో ఉంది. ఫిల్లర్ల నిర్మాణం, డౌన్ ర్యాంపులు, ప్రభుత్వ భూముల అవసరం, రైల్వే అనుమతులు, అంచనా వ్యయం వంటి అంశాలతో కూడిన డీపీఆర్‌ను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## కేబినెట్ విస్తరణ కర్ణాటక ఎఫెక్ట్

హైదరాబాద్ : పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్తులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి ఉవని జి ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత + కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్త్‌లు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చునేది కాంగ్రెస్ ప్లాన్. అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది. కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది. కర్ణాటక కేబినెట్ విస్తరణ గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పాలనకు ఒక ముందస్తు హెచ్చరిక లా పనిచేసింది. కేవలం కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పార్టీ పాతకాపులను గౌరవిస్తూ, రాజీనామాల వేడి తగ్గించే సమగ్ర ప్యాకేజీతోనే రేవంత్ రెడ్డి తన కేబినెట్ విస్తరణను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది. ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి. ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.

## అమెరికా క్షిపణి నిల్వలు.. ట్రంప్,హెగ్సెత్ మధ్య విభేదాలు..

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం అమెరికా అగ్రనాయకుల మధ్య విభేదాలకు కారణమవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా అమెరికా దీర్ఘశ్రేణి క్షిపణులు, వైమానిక రక్షణ వ్యవస్థలకు సంబంధించిన నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం. తరిగిపోతున్న నిల్వలపై తనకు పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వలేదని హెగ్సెత్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. ఆయుధాల కొరత సమస్య పరిష్కారమవుతుందని తాను భావించానని, కానీ ఎందుకు పరిష్కారం కాలేదో తనకు సమాధానం ఇవ్వాలని కూడా రక్షణ మంత్రిత్వ శాఖను ట్రంప్ ఆదేశించినట్టు సమాచారం. ఇరాన్ యుద్ధం మొదలైన నాటి నుంచి ట్రంప్, హెగ్సెత్ మధ్య పలు విషయాల్లో విభేదాలు కొనసాగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. కాగా, అధ్యక్షుడు, రక్షణ మంత్రి మధ్య విభేదాలంటూ వచ్చిన వార్తలను వైట్‌హౌస్ ఖండించింది. ఈ కథనం పూర్తిగా అసత్యమని, మీడియా ప్రచారం చేస్తున్న సమాచారం వాస్తవాలకు విరుద్ధమని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ట్రంప్-హెగ్సెత్ మధ్య ఎలాంటి ఘర్షణా జరగలేదని, అధ్యక్షుడికి అవసరమైన అన్ని భద్రతా వివరాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని పేర్కొంది. అమెరికా సైనిక సామర్థ్యంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేసింది.







# తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ సురక్ష

**బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లిపాలు అందించాలి**
**ప్రతి తల్లి గౌరవంగా పాలిచ్చే వాతావరణం కల్పించాలి**
**ప్రభుత్వ ఆసుపత్రుల్లో తల్లిపాల బ్యాంకుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**





**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 6:** తల్లిపాలు శిశువుకు ప్రకృతి దేవుడు ప్రసాదించిన అమూల్యమైన వరమని, నవజాత శిశువు పుట్టిన అరగంటలోపే తల్లిపాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితానికి బలమైన పునాది వేయవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. శిశువు తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తి కూడా లభిస్తుందని తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మంద పుల్లారెడ్డి (ఎంపీఆర్) ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి నాగర్ కర్నూల్ కేసరి సముద్రం మినీ ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వైద్య కళాశాల విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లిపాలే బిడ్డకు తొలి రక్షణ, డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు, తల్లిపాలు బిడ్డకు జీవనాధారం వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం పెంచేల అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం కేసరి సముద్రం ట్యాంక్ బండ్ పై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., తల్లిపాలు ఇవ్వడం అనేది ప్రకృతిలో అత్యంత పవిత్రమైన ప్రక్రియ అని అన్నారు. బస్టాండ్ల, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో తల్లులు తమ చిన్నారులకు పాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు సమాజం దానిని, చెడు ఆలోచనలతో కాకుండా గౌరవప్రదంగా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అలాంటి సందర్భాలను అపార్థం చేసుకోకుండా, తల్లి,బిడ్డల ఆరోగ్యం, వారి అనుబంధానికి సంబంధించిన పవిత్రమైన ప్రక్రియగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ సూచించారు. శిశువు పుట్టిన వెంటనే తొలి అరగంటలో తల్లిపాలు అందించడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. జననం తర్వాత మొదటి మూడు రోజులలో వచ్చే ముర్రు పాలు (కొలస్ట్రం) శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి టీకా వంటివని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయకుండా బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆ పాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా నీరు కూడా అవసరం లేదని, ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించి, రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించడం వల్ల పిల్లల్లో భవిష్యత్తులో శిశువు రక్తహీనత, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధుల ముప్పు తగ్గుతుందని వైద్యుల సూచనలను విధిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లుల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ సంబంధిత క్యాన్సర్లు, ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గడమే కాకుండా తల్లి,బిడ్డల మధ్య ప్రేమ, ఆప్యాయత, భావోద్వేగ బంధం మరింత బలపడుతుందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో తల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పిల్లలకు పాలిచ్చే వాతావరణం కల్పించడం సమాజ బాధ్యత అని కలెక్టర్ అన్నారు. బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో బాలింతల కోసం ప్రత్యేకంగా పాలిచ్చే గదులు, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. తల్లిపాలపై అపోహలను తొలగించి ప్రతి ఇంటికీ అవగాహన కల్పించడంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, తొలి గంటలోనే తల్లిపాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో దాదాపు 97 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్నప్పటికీ, పుట్టిన అరగంటలోపు కేవలం 37 శాతం మంది శిశువులకు మాత్రమే తల్లిపాలు అందుతున్నాయనే గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి నవజాత శిశువుకు తొలి గంటలోనే తల్లిపాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో తల్లిపాల కొరత కారణంగా ఒక్క శిశువు కూడా ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా తల్లిపాల బ్యాంకుల ఏర్పాటు కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని కలెక్టర్ వెల్లడించారు. ఈ బ్యాంకుల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తల్లిపాలు అందుబాటులో లేని నవజాత శిశువులకు సురక్షితమైన తల్లిపాలను అందించి వారి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ....., తల్లిపాల ప్రాముఖ్యతను గ్రామీణ స్థాయి వరకు విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి గర్భిణి, బాలింతకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. తల్లిపాలు బిడ్డ ఎందుగుదలకు పరిపూర్ణమైన అమృతం తో సమానం అయిందని, మహిళలు తమ బిడ్డలకు తల్లిపాలన అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ విధమైన అవగాహన క్షేత్రస్థాయిలో కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి మాట్లాడుతూ....., డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహారం అందించడమే కాకుండా తల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, ఎంపీఆర్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఎం. పుల్లారెడ్డి, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ రోహిత్, వైస్ చైర్‌పర్సన్, రెడ్‌క్రాస్ చైర్మన్ సాయిబాబా, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, సీడీపీఓ శోభారాణి, వైద్యాధికారులు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, నర్సింగ్ విద్యార్థులు, వైద్య కళాశాల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మిచెడులో అర్ధరాత్రి చోరీ.. పోలీసుల అదుపులో దొంగలు

గద్వాల్ రూరల్:–జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జమ్మిచెడు 4, 5 వార్డుల్లో గురువారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న ఇద్దరు మహిళల మెడలోని బంగారు తాళి గొలుసులను దొంగలు అపహరించారు. బాధితులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గద్వాల సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తన బృందం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి దొంగలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి అపహరించిన బంగారు ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మహబూబాబాద్ ఆర్‌సీఓ లక్ష్మీనారాయణ నాయక్‌కు జర్నలిస్టుల ఘన సన్మానం



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో నూతనంగా ఆర్‌సీఓగా బాధ్యతలు స్వీకరిం చిన లక్ష్మీనారాయణ నాయక్‌ను గురు వారం జర్నలిస్టులు ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లాలో బాధ్యతలు స్వీకరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, తాను కూడా ఈ జిల్లాకు చెందిన వ్యక్తినేనని తెలిపారు. జిల్లాలోని విద్యార్థుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని, గురుకుల విద్యాసంస్థల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఉమ్మగాని మధు, రేఖ వర్మ, బండారి జ్ఞానేందర్, లకావత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజ్వారం అంగన్వాడీ కేంద్రాల్లో అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు. తల్లిపాలను శిశువులకు మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా అందించాలని అంగన్వాడీ సిబ్బంది సూచించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య**



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి సేవలను స్మరించుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య మాట్లాడుతూ..., తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, ఉద్యమ స్ఫూర్తి, అచంచల సంకల్పం కీలక పాత్ర పోషించాయని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలనే లక్ష్యంతో ఆయన జీవితాంతం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా జయశంకర్ సమాజానికి అందించిన సేవలు అమూల్యమైనవని చెన్నయ్య తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు నేటికీ సమకాలీనమైనవేనని అన్నారు. యువత ముఖ్యంగా జయశంకర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించడం ద్వారా జయశంకర్ ఆశయాల సాధనకు తమ వంతు పాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక సమానత్వం సాధనలో ఆయన చూపిన మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఇందిర, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కోసం నీలిపల్లి గ్రామ ప్రజల ఆందోళన




గద్వాల : జోగులాంబ గద్వాల్ జిల్లా, మల్దకల్ మండలం, నీలిపల్లి గ్రామంలోని విద్యార్థులు ప్రతిరోజూ స్కూల్ మరియు కాలేజీలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సు మా గ్రామంలోకి రాకపోవడంతో చిన్నపిల్లలు, బాలికలు, విద్యార్థులందరూ గ్రామం బయట ఉన్న స్టేజి వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు నీలిపల్లి గ్రామ స్టేజి వద్ద గ్రామ సర్పంచ్ , ఉపసర్పంచ్ , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలందరం కలిసి శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**మా ప్రధాన డిమాండ్:** ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి, జోగులాంబ గద్వాల్ జిల్లా, మల్దకల్ మండలం, నీలిపల్లి గ్రామంలోకి ఆర్టీసీ బస్సును తీసుకువచ్చి విద్యార్థులను గ్రామంలోనే ఎక్కించుకొని వెళ్లే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇది రాజకీయ కార్యక్రమం కాదు. ఇది మా గ్రామ విద్యార్థుల విద్య, భద్రత మరియు భవిష్యత్తుకు సంబంధించిన న్యాయమైన డిమాండ్. సంబంధిత ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని నీలిపల్లి గ్రామ ప్రజలందరం కోరుతున్నామన్నారు. నీలిపల్లి గ్రామ ప్రజల తరఫున మల్దకల్ మండలం, జోగులాంబ గద్వాల్ జిల్లా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేరేడుగొమ్ము మండల అభివృద్ధే లక్ష్యంగా శాఖల వారీగా సమగ్ర సమీక్ష

**దేవరకొండ, నేరడుగోమ్మూ : ఆగస్టు 6 (సమయం ప్రతినిధి) :** నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి జనరల్ బాడీ (సమీక్ష) సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. అన్ని శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. సమావేశానికి ముందు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయ శంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలకు అను గుణంగా గ్రామీణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మండలంలోని అన్ని శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై శాఖల వారీగా సుదీర్ఘంగా సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన నేరేడుగొమ్ము మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాల తో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయాన్ని నిర్మించను న్నట్లు ప్రకటించారు. ఈ సముదాయంలో రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయం, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, విద్య, వైద్యం, పశుసంవర్ధక, హౌసింగ్, గ్రామీణాభివృద్ధి తదితర అన్ని శాఖల మండల కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేయబడతాయని తెలిపారు.దీంతో ప్రజలు ఒక పని కోసం ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరగాల్సిన అవసరం ఉండదని, అన్ని ప్రభుత్వ సేవలు ఒకే ప్రాంగణంలో సులభంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో ప్రతి శాఖ అధికారి తమ శాఖలో అమలవుతున్న పథకాలు, పెండింగ్ పనులు, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. గ్రామ సర్పం

**రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయం నిర్మాణం**



చులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై వెంటనే స్పందించి పరిష్కారా నికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.తాగునీటి సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తూ ప్రతి గ్రామంలో ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల సమస్యలు, నీటి కొరత ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్లు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీఓ (VO) భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, మరమ్మత్తులపై సమీక్షించి పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై చర్చిస్తూ ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో తప్పనిసరిగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పిం చాలని ఆదేశించారు. మహిళా సంఘాల అభివృద్ధి విషయంలో ప్రభు త్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొంటూ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అలాగే మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు మరణించిన సందర్భాల్లో ఆయా రుణాలను కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని వివరించారు. ప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని చెప్పారు.హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులపై సమీక్ష నిర్వ హిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు బిల్లులు త్వరితగతిన విడుదలయ్యేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యాశాఖ అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుపై చర్చిస్తూ, నర్సరీలో చేరే పిల్లల విషయంలో అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చివరగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జనరల్ బాడీ సమావేశాల ముఖ్య ఉద్దేశం ప్రజల సమస్యలను అధికార యంత్రాంగం ముందుంచి శాఖల మధ్య సమన్వయంతో త్వరితగతిన పరిష్కారం చూపడమేనన్నారు. అధి కారులు గ్రామాలకు వెళ్లి ప్రజలతో మమేకమై పనిచేయాలని, ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల కు జవాబుదారీ తనంతో పనిచేసే పరిపాలనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్య మని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు. ఈ సమా వేశంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్లు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పత్రిక విలేకరులు, పాల్గొన్నారు.

## జీవితకాలం కాంగ్రెస్ విధానాలు వ్యతిరేకించిన తెలంగాణవాది ప్రొఫెసర్.జయశంకర్





తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త జయంతి సందర్భంగా మాజీ మంత్రి నివాళులు

వనపర్తి : ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలంగాణ భవన్ లో ఘనంగా నివాళులు అర్పించారు.అదేవిధంగా నిరంజన్ రెడ్డి స్వగృహంలో జిల్లా బి.ఆర్.ఎస్ శ్రేణులు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,కె.మాణిక్యం మాట్లాడుతూ నాటి విద్యార్థి ముల్కీ ఉద్యమంలో 1969లో ఉద్యమ పంతులుగా తదనంతరం తెలంగాణ ఉద్యమ నిప్పురవ్వను ఆరిపోనీయకుండా మూడు దశాబ్దాలపాటు రాష్ట్ర అభిలాషను సజీవంగా ఉంచిన తెలంగాణ కర్మయోగి,నిస్వార్థ నిడంబర,విశ్వమానవ తేజోమూర్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.కె.సి.ఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి దశాబ్దంపైగా సిద్ధాంత కర్తగా ఊపిరులూదిన తెలంగాణ జ్ఞాన శిఖరం ప్రొఫెసర్ జయశంకర్ కి నివాళులు అర్పించారు. తెలంగాణ పోరాట యోధుడు గద్దర్ తెలంగాణ సాధన కోసం తన ఆట పాటతో ప్రజలను చైతన్యపరిచి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన విప్లవమూర్తి గద్దర్ గారి వర్ధంతి సందర్భంగా బి.ఆర్.ఎస్ శ్రేణులు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్,నందిమల్ల.అశోక్,కె.మాణిక్యం, గంధం.పరంజ్యోతి, జాత్రు నాయక్,ప్రేమ్ నాథ్ రెడ్డి,స్టార్.రహీమ్,రఘువర్ధన్ రెడ్డి,మాధవ్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము, ధర్మశాస్త్ర,వెంకటేష్,సిరిగిరి.మన్నెం, కుమ్మరి.సత్యం,కరుణాకర్,చందు నాయక్,ఖాదర్ఖ, శిరీవాటి.శంకర్,అరీఫ్,అలీమ్,విష్ణు గౌడ్,బుచ్చిబాబు,వంశీ తదితరులు ఉన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని మెరుగు పరచాలి



వనపర్తి జిల్లా అమరచింత మండలం ఈర్లదిన్నె హై స్కూల్ ను జూవీ పార్టీ ఆధ్వర్యంలో ఈ రోజు స్కూల్ ని సందర్శించి సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా జూవీ పార్టీ మండల కార్యదర్శి +గా గోపి మండల కార్యదర్శివర్గ సభ్యులు దీ వెంకటేష్ టీ. రాఘవేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల ఎంత నిబద్ధతతో పని చేస్తుందో ప్రజలకు స్పష్టంగా కనబడుతుందని ఏదేవా చేశారు. ప్రాథమిక పాఠశాలకి మూత్రశాలలు అవసరం ఉన్నవని విద్యార్థులకు టీచర్స్ కు ఇబ్బంది ఉన్న కూడా చదువులు కొనసాగించడం జరుగుతుదని వెంటనే జిల్లా కలెక్టర్ గారు గౌరవ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారు స్పందించి అమరచింత మండల విద్యారంగాని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో జూవీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజ్వారంలో ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

### చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నాయకులు



(సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా) : మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో విశ్వకర్మ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వై.రాజారెడ్డి, మల్దకల్ మండల విశ్వకర్మ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మయ్య చారి మాట్లాడుతూ... నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పిన మహా జ్ఞాని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని అన్నారు.స్వరాష్ట్ర తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత తెలంగాణ సిద్ధార్థకర్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజ్వారం విశ్వకర్మ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల కృష్ణయ్య చారి, సంఘం కమిటీ సలహాదారుడు జులకల్ కృష్ణయ్య చారి,నాగేశ్వర్ రెడ్డి,కె. రఘు చారి, మాజీ సర్పంచ్ బైని తిమ్మప్ప,సీమలోంబాయి తిమ్మప్ప,సాయినాథ్ రెడ్డి,మహ్మద్,వాల్మీకి సంఘం నాయకులు మెకానిక్ గోవింద్, కొంకల గోకరన్న,ఎల్లప్ప,ఉప్పరి శ్రీను,ఈశ్వరయ్య చారి,టైలర్ సుభాన్,వాల్మీకి రాముడు,జె. నాగేశ్వరయ్య,గిరి, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## యువతే పార్టీకి వెన్నెముక పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



హైదరాబాద్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ యువజన విభాగంతో టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర,జిల్లా నాయకులతో పార్టీ విస్తరణ, యువత పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ, యువతే సమాజ మార్పుకు అసలైన శక్తి అని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రతి గ్రామం, ప్రతి ఊరు, ప్రతి కళాశాలకు తీసుకెళ్లే బాధ్యత యువజన విభాగంపైనే ఉందన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రతి మండలం, ప్రతి గ్రామంలో యువజన కమిటీలను బలోపేతం చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగిస్తూ పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానించాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా విద్య, ఉద్యోగాలు, బీసీల రాజ్యాధికారం, సామాజిక న్యాయం వంటి ప్రజా సమస్యలపై యువజన విభాగం ముందుండి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో క్రమశిక్షణ, అంకితభావం, ప్రజలతో నిరంతర అనుబంధమే విజయానికి పునాది అని మల్లన్న స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని మల్లన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గంగాధర్ లింగాల,ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్,స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్ రాష్ట్ర,జిల్లా యువజన విభాగం నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ బ్రాండ్ అంబాసిడర్ గా చిరు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక బ్రాండ్ అంబాసిడర్‌గా మెగాస్టార్ చిరంజీవిని నియమించే దిశగా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పర్యాటకరంగం అభివృద్ధి , అలాగే ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల విశిష్టతను అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేసేందుకు ఆయన ప్రతిభను వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాథమిక సంప్రదింపులు కూడా పూర్తయ్యాయని చెబుతున్నాయి. గతంలో గుజరాత్ పర్యాటక రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా రంగంలోకి దింపారు. అదే తరహా వ్యూహంతో ఆంధ్రప్రదేశ్ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు చిరంజీవి క్రేజ్, గ్లోబల్ పాపులారిటీ ఎంతగానో ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది.జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు సాధించడంతో పాటు గతంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం చిరంజీవికి ఉంది. సినిమా రంగానికే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయనకున్న విశ్వసనీయత రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మక్తల్ పట్టణంలో కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం

మక్తల్ : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మక్తల్ పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి వాకిటి మానస హనుమంతు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలుస్తూ ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, నేడు మంత్రివర్యులు మక్తల్‌లో లేకపోయినా, “ఎట్టి పరిస్థితుల్లోనూ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఆగకూడదు. మీరు వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు అందజేయండి” అని ఆదేశించడం తమకు ఎంతో గర్వకారణమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్ , మాజీ జడ్పీటీసీ జి. లక్ష్మారెడ్డి , ఏఎంసీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్టా సురేష్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మున్సిపల్



కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ







**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**
**విద్యార్థుల హాజరు, బోధన, మౌలిక వసతులు, పాఠశాల నిర్వహణపై కలెక్టర్ ఆరా**
**విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచన**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 6 :** నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, బోధన నాణ్యత, హాజరు శాతం, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా ముందుగా పాఠశాల హాజరు నమోదును పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పూర్తి అంకితభావంతో బోధన నిర్వహించాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధనా విధానాలను అమలు చేయాలని సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠాల అవగాహన, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలోని మౌలిక వసతులు, తరగతి గదుల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వసతి గృహం, భోజనశాల నిర్వహణ, పరిసరాల పారిశుద్ధ్యం వంటి అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి సౌకర్యం నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా ప్రమాణాల పెంపు, మెరుగైన ఫలితాల సాధన, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ విజయకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# కార్పొరేట్ సంస్థలకి వాతస్తూ పలుకుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం



**విదేశీ కంపెనీలకి తాకట్టు పెడుతున్న వ్యవసాయం**
**10న జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**
**రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల పిలుపు**

వనపర్తి : వనపర్తి జిల్లా కేంద్రంలోని CITU జిల్లా కార్యాలయం భవన్‌లో CITU,TUCI, AITUC, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రగతి శిలా రైతు సంఘం, ఆధ్వర్యంలో ఈ రోజు రౌండ్ టేబుల్ సమావేశం, జ×ఖ జిల్లా అధ్యక్షులు R N రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా CITU జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, TUCI జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, AITUC జిల్లా ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ,తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొడ్ల బాల్ రెడ్డి, పరమేశ్వరచారి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు S అజయ్, మేకల ఆంజనేయులు, ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ. ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. 29 లేబర్ చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నారు. 8 గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటలకు పని దినాన్ని తీసుకురావడం, కార్మికులకు తీరని నష్టం చేసే విధంగా ఉన్నాయని వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి 29 కార్మిక చట్టాలని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుపేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసి వీబీ రాంజీ పేరుతో ఉపాధి హామీని నీరుగార్చే విధంగా రాష్ట్రం వాటా 40% ఇస్తే కేంద్రం వాట 60% జమ చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని గత ప్రభుత్వాలు 90% కేంద్రం నుంచి నిధులు ఇచ్చే వాళ్ళని వెంటనే విబి రాంజీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఎంఎస్పి చట్టాన్ని అమలు చేయాలని గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. భారతదేశానికి స్వతంత్రం రాకముందు ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమని రగిలించి భారత దేశ ప్రజలను ఐక్యం చేసి బ్రిటిష్ వాళ్ళని ఈ దేశం నుంచి తరిమేసినరు, కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకి కారు చౌకగా ప్రభుత్వ రంగ సంస్థలను భారతదేశం యొక్క భౌగోళిక స్వరూపాన్ని ధ్వంసం చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు ఇతర దేశాలకు చౌకగా అమ్మేయడం జరుగుతుందని అందులో భాగంగానే భారతదేశ కార్మిక వర్గాన్ని వ్యవసాయ కూలీలను రైతాంగాని పరోక్షంగా బడా కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం విధానాలు తీసుకురావడం సరి అయినది కాదని ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో భారతదేశ ప్రజల యొక్క మౌలిక హక్కులని కాపాడడం కోసం కార్మిక వర్గాన్ని నిలబెట్టడం కోసం ఎంతటి త్యాగానికైనా కార్మిక వర్గం ముందుండి పోరాడుతుందని ఇలాంటి మోడీలను ఎంతోమందిని ఇంటికి పంపిందని అలాంటి నరేంద్ర మోడీ కార్మికులతో చెలగాటమాడుతున్నాడని రాబోయే కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులు కర్షకులు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో CITU జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్, ఉపాధ్యక్షులు సునిత, కవిత, TUCI జిల్లా ఉపాధ్యక్షులు జ. రాజు, GP జిల్లా కార్యదర్శి గణేష్, వ్య. కా. సా జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్, CITU జిల్లా నాయకులు నందిమాళ్ళ రాములు,మాదిలేటి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీసీ సమాజ్ ఘన నివాళి




మహబూబ్‌నగర్ (సమయం), ఆగస్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకుడు, స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బీసీ సమాజ్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.పద్మావతి కాలనీలోని గ్రీన్‌బెల్ట్ కాలనీలో ఉన్న ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచారని, సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై నిరంతరం గళమెత్తి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఐదు దశాబ్దాల పాటు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. వామపక్ష భావజాల ఉద్యమాలు, మానవ హక్కుల పోరాటాలతో పాటు తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన మహోన్నత వ్యక్తిగా ఆయనను స్మరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ గౌరవ అధ్యక్షుడు శివార్చక విజయ్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్, బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు సారంగి లక్ష్మీకాంత్, నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ ఆకస్మిక తనిఖీలు

**నిబంధనలు పాటించని దుకాణాలకు నోటీసులు**
**ఈ-పాస్ ద్వారా విక్రయాలు, రైతులకు బిల్లులు తప్పనిసరి: అధికారులు**




**సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా :** గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా రైతులకు ఎరువులను తప్పనిసరిగా ఈ-పాస్ (e-POS) యంత్రం ద్వారా మాత్రమే విక్రయించాలని, విక్రయించిన ప్రతి ఎరువు, పురుగుమందుకు వెంటనే బిల్లు జారీ చేయాలని దుకాణదారులకు సూచించారు. కాలం చెల్లిన ఎరువులు లేదా పురుగు మందులను దుకాణాల్లో నిల్వ ఉంచితే వ్యవసాయ శాఖ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీలలో కొన్ని దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం గుర్తించి, సంబంధిత దుకాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గద్వాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రతాప్ కుమార్, గట్టు మండల వ్యవసాయ అధికారి హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



**జడ్చర్ల, ఆగస్టు 6, సమయం ప్రతినిధి:** స్థానిక ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల పోలీసు సీఐ శ్రీ కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత పద్ధతులను వివరిస్తూ, మొబైల్ ఫోన్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్ నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేసేటప్పుడు అధికారిక వేదికలను మాత్రమే వినియోగించాలని, ముఖ్యంగా ఏపీకే (APK) ఫైళ్ల విషయంలో అత్యంత జాగ్రత్త అవసరమని తెలిపారు. వాట్సాప్, సోషల్ మీడియా లేదా ఇతర ఆన్‌లైన్ వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులు, సందేశాలను తెరవొద్దని హెచ్చరించారు. అలాగే లోన్ యాప్‌ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు,యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్, ఏజీఎంఓ రామకృష్ణ గౌడ్, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజ్వారం అంగన్వాడీ కేంద్రాల్లో అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు




సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు. తల్లిపాలను శిశువులకు మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా అందించాలని అంగన్వాడీ సిబ్బంది సూచించారు.


# ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...

హైదరాబాద్ : ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు.ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ.1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు.2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు.ఈ క్రమంలోనే విఖ్యాత్ సింగ్ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సమయం ప్రతినిధి :** జిల్లాలోని ప్రతి గర్భిణికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత (అనీమియా) సమస్య ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం గోపాలపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. లేబర్ రూమ్‌లో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేసి, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఈడీడీ (EDD) రిజిస్టర్‌ను పరిశీలించి, రాబోయే తొమ్మిది నెలల్లో ప్రసవించనున్న గర్భిణుల వివరాలు, వారికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ప్రసవాల వివరాలు, రక్తహీనత సమస్యతో బాధపడుతున్న గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడు తున్న గర్భిణులను వెంటనే గుర్తించి వారికి పోషకాహారం, అవసరమైన మందులు అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎంసీహెచ్ (MCH) పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి పరీక్షల కోసం వచ్చిన ఓ గర్భిణితో కలెక్టర్ మాట్లాడి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరీక్షలు, మందుల పంపిణీపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. అలాగే ఆసుపత్రిలో రోజువారీ ఓపీ (OP) వివరాలను పరిశీలించి, చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఆస్పత్రికి అత్యవసరంగా వచ్చే రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేబర్ రూమ్‌లకు(డెలివరీ రూమ్) అవసరమైన మౌలిక వసతులు, పరికరాలు లేదా ఇతర అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





## ఎయిర్ పోర్ట్ ఎఫెక్ట్... ఆ 30 గ్రామాలకు కనెక్టివిటీ కట్

అదిలాబాద్ : ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూసేకరణలో అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో 30 గ్రామాలకు కనెక్టివిటీ లేకుండా పోతుంది. దీంతో ప్రత్యామ్నాయంగా కచికంటి మీదుగా కొత్త బైపాస్ నిర్మించనున్నారు. 66 అడుగుల వెడల్పుతో రూపొందనున్న ఈ రహదారి కోసం ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. బంగారుగూడ, కచికంటి మీదుగా జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకునేలా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. విమానాశ్రయ నిర్మాణం కారణంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణంతో జిల్లాలో రహదారి వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. విమానాశ్రయం కోసం చేపట్టనున్న భూసేకరణలో ప్రస్తుతం వేలాది మంది వినియోగిస్తున్న అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుపై దృష్టి సారించారు. దాదాపు 30 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్త బైపాస్ రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణం నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని కచికంటి గ్రామానికి వెళ్లేందుకు శ్రీరాంకాలనీ, కుమ్మరివాడ, విమానాశ్రయ స్థలానికి ఆనుకుని ఉన్న ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ మీదుగా ప్రయాణిస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణంతో ఈ మార్గం మూసివేయబడే అవకాశం ఉండటంతో కచికంటి నుంచి బంగారుగూడ ప్రధాన రహదారిని అనుసంధానించే కొత్త రహదారిని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం కచికంటి గ్రామ సమీపంలో కొత్త బైపాస్ నిర్మించి, అక్కడ అవసరమైన భూసేకరణ చేపట్టనున్నారుకొత్త రహదారిని 66 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ద్వారా బంగారుగూడ, కచికంటి మీదుగా ఆదిలాబాద్ పట్టణానికి సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుంది. దీంతో విమానాశ్రయ నిర్మాణం వల్ల కలిగే రవాణా ఇబ్బందులు తగ్గడంతో పాటు భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ రహదారిని రూపొందిస్తున్నారు. ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ, రాముల్‌గూడ, కొత్తగూడ, యశ్వంత్‌గూడ, మత్తడిగూడ, బూర్నూర్, అడ్డగుట్ట, శివఘాట్, కుంభఝరి, టాక్లీ గ్రామాలతో పాటు సాత్నాల మండలంలోని రామాయి, జాముల్‌ధరి, న్యూరాంపూర్, సాత్నాల, సుందరగిరి, మాంగూర్ల, కాన్పమేడిగూడ, మేడిగూడ, జామ్నీ, మారుగూడ, తోయగూడ, సైద్‌పూర్, సహేజ్, సాంగ్వి, జామ్డ గ్రామాల ప్రజలు నిత్యం ఈ దారినే వినియోగిస్తున్నారు. అదేవిధంగా గాదిగూడ మండలంలోని పరస్వాడ, లోకారి, గాదిగూడ గ్రామాల ప్రజలు కూడా జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.ఇవే కాకుండా ఆదిలాబాద్ అర్బన్ పరిధిలోని బంగారుగూడ, అనుకుంట గ్రామాల ప్రజలకు కూడా ఇదే ప్రధాన రహదారి. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మరికొన్ని గ్రామాల వాసులు కూడా ఆదిలాబాద్‌కు రావడానికి ఈ దారినే ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో రోజూ ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా అనుకుంట ప్రాంతం చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను ప్రభుత్వం సేకరించనుంది. దీంతో ఖానాపూర్ సమీపంలోని అనుకుంట మలుపు నుంచి అనుకుంట గ్రామం వరకు ఉన్న ప్రస్తుత రహదారి విమానాశ్రయ పరిధిలోకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాకపోకలు కల్పించేందుకు కొత్త రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంది.

## మయన్మార్ తో భారత్ స్మూత్ డీల్

న్యూఢిల్లీ : మయన్మార్ సరిహద్దుల్లో దశాబ్దాలుగా గుర్తించని వివాదాస్పద ప్రాంతాల పరిష్కారం కోసం భారత్ భూభాగ మార్పిడి ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "సరిహద్దులో ఇంకా పరిష్కరించని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి... ఆయా అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి" అని తెలిపారు. మణిపూర్ సరిహద్దుల వెంబడి మయన్మార్‌తో భూ మార్పిడికి భారత్ సిద్ధమవుతోందన్న నివేదికలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి చర్చలు జరుగుతున్నాయనే ఈ నివేదికలను ఆయన పరోక్షంగా అంగీకరించారు.దీనిపై అమెరికాకు చెందిన 'ది డిప్లొమాట్' పత్రిక కొద్ది వారాల కిందట కథనం ప్రచురించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మణిపూర్-మాయన్మార్ సరిహద్దులోని పిల్లర్ 65 నుంచి 68 మధ్య ఉన్న సుమారు 2.8 కిలోమీటర్ల పరిధిలోని 1.4 చదరపు మైళ్ల భూభాగాన్ని మార్పిడి చేసుకోవడం ద్వారా సరిహద్దు గుర్తించే ప్రక్రియను పూర్తి చేయాలని భారత ప్రభుత్వం ఒక ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు అధికారిక పత్రాలను ఉటంకిస్తూ జులై 17న సదరు పత్రిక నివేదించింది. భూ మార్పిడి కోసం ప్రతిపాదించిన ప్రాంతం మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో, మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతంలో ఉన్న కబావ్ లోయకు ఆనుకొని ఉంది. మే 26, 2026 నాటి అధికారిక పత్రం ప్రకారం, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియ మూడు నెలల్లో అంటే సుమారుగా ఆగస్టు నాటికి పూర్తి కావాల్సి ఉంది.భారత్, మయన్మార్‌లు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం గుండా మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతం, చిన్ రాష్ట్రాల్లోకి ప్రవేశించే 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దులో మెజార్టీ ప్రాంతం కొండలు, అడవులతో నిండి ఉండి చొరబాట్లకు అనుకూలంగా ఉంటుంది. ఇరువైపులా చారిత్రాత్మకంగా ఒకే వర్గానికి చెందిన గిరిజన జాతులు నివాసం ఉంటున్నారు. కేంద్ర హోం శాఖ ప్రకారం.. పిల్లర్ల ద్వారా సుమారు 1,472 కిలోమీటర్ల సరిహద్దును నిర్ధారించారు. అయితే, ప్రధానంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని లోహిత్ సెక్టార్, మణిపూర్‌లోని కబావ్ లోయలో దాదాపు 171 కిలోమీటర్ల సరిహద్దు ఇంకా పరిష్కారం కాలేదు.'ది డిప్లొమాట్' ప్రకారం.. భారత్-మయన్మార్ సరిహద్దులో ఇంకా అపరిష్కృతంగా ఉన్న ప్రాంతంలో గుర్తింపు నిర్ధారణను వేగవంతం చేయడమే భూభాగ మార్పిడి వెనుక ఉద్దేశం. దీనివల్ల సరిహద్దు పొడవునా కంచె నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోతాయి. తత్ఫలితంగా అక్రమ వలసలు, తిరుగుబాటుదారుల కదలికలు, ఇతర సరిహద్దు నేరాలను అరికట్టడానికి వీలు కలుగుతుంది.మయన్మార్ వెంబడి 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దు కంచె ప్రణాళికను 2024లో భారత్ ప్రకటించింది. అదే సమయంలో 2018 నుంచి అమల్లో ఉన్న భారత్-మయన్మార్ సరిహద్దు స్వేచ్ఛా రాకపోకల విధానాన్ని కూడా రద్దు చేసింది. ఈ విధానం ప్రకారం.. సరిహద్దు సమీపంలో నివసించే గిరిజన వర్గాలు, బోర్డర్ పాస్ ఉపయోగించి వీసా లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కిలోమీటర్ల వరకు ప్రయాణించడానికి అనుమతి ఉండేది.ప్రస్తుత భారత్-మయన్మార్ సరిహద్దును 1967 ద్వైపాక్షిక ఒప్పందం కింద నిర్వచించారు. కానీ దానిలోని కొన్ని భాగాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అపరిష్కృత ప్రాంతాలను ద్వైపాక్షిక సరిహద్దు యంత్రాంగం ద్వారా నిర్ధారిస్తామని, ఇందులో భాగంగా తొమ్మిది పిల్లర్లు గుర్తించి, ఏర్పాటు చేస్తామని 2018లో పార్లమెంట్‌కు కేంద్రం తెలిపింది.మణిపూర్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతాల్లోని 64-68 పిల్లర్ల మధ్య ఉన్న మోల్చామ్ సెక్టార్, 75- 79 పిల్లర్ల మధ్య ఉన్న మోరే సెక్టార్, 88-95 మధ్య ఉన్న చోరో ఖునౌ సెక్టార్ కీలకమైనవి. మయన్మార్‌తో విస్తృతమైన సరిహద్దు వివాదం ఏదీ లేదని, కేవలం తొమ్మిది పిల్లర్లు మధ్య ప్రాంతాలపై మాత్రమే ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా పరిష్కరిస్తున్నామని భారత్ తరుచూ చెబుతోంది.అయితే, పొరుగు దేశాల మధ్య భూభాగ మార్పిడి అసాధారమైంది ఏమీ కాదు. 2015లో భారత్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన భూ సరిహద్దు ఒప్పందం ద్వారా న్యూఢిల్లీ తన భూభాగంలోని 111 ఎన్‌క్లేవ్‌లను ఢాకాకు బదిలీ చేసి, బదులుగా 51 బంగ్లాదేశ్ ఎన్‌క్లేవ్‌లను పొందింది. దీంతో 41 ఏళ్ల నాటి సరిహద్దు వివాదం ముగిసింది. అయితే, ఈ ప్రతిపాదన మణిపూర్‌లో ఇప్పటికే వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. 'ది డిప్లొమాట్' నివేదిక తర్వాత స్థానిక ఇంఫాల్ టైమ్స్ కథనం ప్రకారం.. మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ కేంద్రానికి తీవ్ర హెచ్చరికలు చేసింది. తమ రాష్ట్ర భూభాగంలో చిన్న భాగాన్ని కూడా మయన్మార్‌కు అప్పగించవద్దని, ఒకవేళ అటువంటి ప్రతిపాదనను అమలు చేస్తే, ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని 'కొకొమి' స్పష్టం చేసింది

## కాంగ్రెస్ వైపు యువత మారుతోందా

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెన్ జీకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో యువతను ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి జెన్ జీ నేతలతో తరచూ సమావేశమవుతున్నారు. వారి సమస్యలను తెలంగాణలో పరిష్కరించడమే కాకుండా వారు ఎన్నికల్లో పోటీ చేసే వయసు విషయంలోనూ వయసును తగ్గించాలని ఇటీవల రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరిసిస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. రాష్ట్రంలోనూ యువ ఓటర్లకు గాలం వేయాలన్న ప్లాన్ లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో సీనియర్ నేతలను పక్కన పెట్టి యువతకు సీట్లు కేటాయించేలా ఢిల్లీ పర్యటనలో పార్టీ హైకమాండ్ ను ఒప్పించనున్నారని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చట్టసభల్లో 'జెన్ జీ' యువతకు ప్రాతినిధ్యం పెరగాలని, పోటీ చేసే వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరడం ద్వారా యువత దృష్టిని ఆకర్షిస్తున్నారు. భవిష్యత్ రాజకీయాల్లో యువత పాత్ర కీలకం అని ఆయన భావిస్తున్నారు. అయితే, విద్యార్థుల నైపుణ్యాలపై ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీశాయి.రేవంత్ రెడ్డి వ్యూహం మరియు ప్రాధాన్యతలు యువత వైపు ఇటీవల కాలంలో కనిపించడం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. చట్టసభల్లో జెన్ జీ యువతకు అవకాశం కల్పించాలని ప్రతిపాదన ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పెట్టనున్నారు. ఈ తీర్మానం తెలంగాణ అసెంబ్లీలో చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి బీజేపీని కూడా ఇరుకున పెట్టే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనపడు?ది. ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 ఏళ్లకు కుదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో యువ నాయకులకు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు తెచ్చేలా ఒత్తిడి తెచ్చే వ్యూహంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయ వ్యూహాలు అమలు చేయడం ఇప్పుడు తెలంగాణలో రాజకీయంగా చర్చ జరుగుతుంది. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే కాకుండా దేశంలోని యువత మొత్తాన్ని కాంగ్రెస్ వైపు మళ్లించి వచ్చే ఎన్నికల నాటికి దేశంలోకాంగ్రెస్ పార్టీకి దగ్గర చేయాలన్న స్ట్రాటజీ రేవంత్ చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరుకున పెట్టేందుకు ఇది మరింత ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రొ, జయశంకర్ 92వ జయంతి వేడుకలు

### తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం
### జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

**వనపర్తి ఆగస్టు-06:** వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు.ఆయన తెలంగాణ కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి బలమైన సిద్ధాంతపరమైన పునాది వేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని కొనియాడారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, సమాన అభివృద్ధి కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత, దూరదృష్టి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజం పట్ల బాధ్యత, నిజాయితీ, సేవాభావం, ప్రజా సంక్షేమం వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. జయశంకర్ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా కర్తవ్య నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని యువత దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏ ఓ, సునంద, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, సిసిఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, వినోద్, పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి





**లింగాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**
**అప్పాయపల్లి ఫామ్ పాండ్ నిర్మాణ పనులు పరిశీలన**
**నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 6 :** మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో లభించే స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా లింగాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, చికిత్స విధానం, ప్రసూతి సేవలు, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సత్వర వైద్యం అందించాలని, వైద్య సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గిరిజన, మారుమూల గ్రామాల ప్రజలు ఆరోగ్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా స్థానికంగానే మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సేవాభావంతో పనిచేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రతినెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని,బ్లడ్ శాంపిల్స్ ఎన్ని సేకరిస్తున్నారని, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల పైన దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులకు సూచించారు. ప్రసవ గది, ల్యాబొరేటరీ గది, నీ పరిశీలించారు. రికార్డులను కూడా ఈ సందర్భంగా పరిశీలించి ఓపి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు లింగాల మండలంలో పరిధిలోని అప్పాయపల్లి గ్రామ రైతు మల్లయ్య పొలంలో వి.బి.జీ. రాంజీ పథకం కింద నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, పనుల పురోగతి, పనుల అమలు తీరు, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు, భూగర్భ జలాల పెరుగుదలకు, సాగునీటి అవసరాలను తీర్చడంలో ఫామ్ పాండ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే నాణ్యతతో పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో మొత్తం మూడు ఫామ్ పాండ్‌లు నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పనులను నిర్దేశిత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు నేరుగా చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట లింగాల తహసిల్దార్ వెంకటేష్, గ్రామ సర్పంచ్ విజయకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణయం : ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి సమయం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయ విద్యావేత్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలు, త్యాగం, అంకితభావం చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం 1952 నుంచే ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రజల్లో చైతన్యం నింపుతూ, ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన గొప్ప దార్శనికుడు జయశంకర్ ని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వార్థరహిత సేవతో తెలంగాణ సమాజానికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఎలా ఎదిగాడో...దానికి డబుల్ స్పీడ్ లో... దిగజారిన ఉదయ్ కృష్ణారెడ్డి

ఒంగోలు : ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కష్టపడి పైకి వచ్చారు. ఎంత వేగంగా ఎదిగారో.. అంతే స్పీడ్ గా పతనమయ్యారు. ఒక బలహీనత ఆయన కెరీర్ ను ప్రమాదంలోకి నెట్టేసింది. మహిళలతో సంబంధాల కోసం ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ ఉద్యోగానికే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు పోలీసుల విచారణతో వెదలయింది. ట్రెయినీ మహిళ ఐపీఎస్ తో మాత్రమే కాకుండా మరో మహిళతోనూ వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడయింది. తమ ప్రాంతానికి చెందిన మహిళ హైదరాబాద్ లో ఉండటం, ఆమెను లోబర్చుకున్నారన్న ఆరోపణలు ఉదయ్ కృష్ణారెడ్డిపై వినిపిస్తున్నాయి.... ట్రయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కీలక పురోగతి కనిపిస్తుంది. ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో కత్తి, రెండు ప్రేమలేఖలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వివాహితతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలిని కలిసిన తర్వాత ఉదయ్‌కు వివాహిత దూరమైనట్లు కూడా కనుగొన్నారు. తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి... కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఒక కత్తి, వేర్వేరు చేతిరాతలతో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నారు.

# సిటలో 56 శాతమే పూర్తయిన డిజిటైజేషన్

హైదరాబాద్ : తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ ౹ాఎఖీ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలానికి దారితీసింది. 2002 నాటి ఓటర్ల డేటాబేస్, జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు, ఆధార్ ఆధారిత మ్యాపింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్న వ్యత్యాసాల కారణంగా దాదాపు 10 శాతం మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుంచి గల్లంతయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఫారమ్‌ల డిజిటైజేషన్ మందకొడిగా సాగుతుండటం, అసెంబ్లీ నియోజకవర్గాల వ్యాప్తంగా లక్షలాది మందికి బిఎల్వోల ద్వారా నోటీసులు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ డేటా క్రోడీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చివరి క్షణంలో ఫ్యామిలీ సర్టిఫికెట్లు, వారసత్వ ధ్రువీకరణలను వేగంగా జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. తెలంగాణ ఐటీ , రెవెన్యూ యంత్రాంగం ద్వారా మీ-సేవ కేంద్రాల్లో ఈ సర్టిఫికెట్లను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ప్రాసెస్ పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అత్యధికంగా ఓట్ల తొలగింపు నోటీసులు రావడం, డిజిటైజేషన్ నమోదు కేవలం 56 శాతానికే పరిమితం కావడం నగర జనాభాను తీవ్ర అయోమయంలోకి నెట్టిందిఈ తీవ్ర విమర్శలు మరియు క్షేత్రస్థాయి విఫలతలపై కాంగ్రెస్ అధిష్టానం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లు బూత్ లెవెల్ ఏజెంట్లతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల ఓట్లను సక్రమంగా నమోదయ్యేలా చూడటంలో పర్యవేక్షణ లోపించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలగడం సరికాదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు , నాయకుల పనితీరుపై హైకమాండ్ క్లాస్ తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కొన్ని కీలక నియోజకవర్గాల్లో పక్కా వ్యూహంతో కుట్రలు జరుగుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బలమున్న సాంప్రదాయ ఓటర్లను, బహుజన, మైనారిటీ , నిరుపేద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు, కొన్ని వర్గాలు కుట్రపూరితంగా పేర్లు తొలగించేలా బిఎల్వోల స్థాయిలోనే తప్పుడు రికార్డులు క్రియేట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటు కూడా పోకుండా కాపాడుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ ప్రత్యేక పరిస్థితులు, హైదరాబాద్ నగరంలో నత్తనడకన సాగుతున్న ప్రాసెస్, క్షేత్రస్థాయి ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. తెలంగాణలో సర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ డెడ్‌లైన్‌ను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక షెడ్యూల్‌ను సవరించింది. కేంద్ర సీఈవో కార్యదర్శి నవీన్ కుమార్ స్వయంగా హైదరాబాద్ వచ్చి డోర్-టు-డోర్ సర్వేను, నియోజకవర్గాల వారీ డేటాను రీ-వెరిఫై చేయాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ ఓటర్ల డేటా సమరం తెలంగాణ రాజకీయంలో కాంగ్రెస్ , ప్రతిపక్షాల మధ్య సరికొత్త వేడిని రగిల్చింది. ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ సర్టిఫికెట్ల సహాయంతో తొలగించిన ఓటర్లు తమ హక్కును తిరిగి పొందుతారా లేదా ముసాయిదా జాబితా నాటికి భారీ స్థాయిలో ఓట్ల కోత తప్పదా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

## అనగానికి రాజకీయ ఇబ్బందులు

గుంటూరు : తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రధాన అనుచరుడు గూడపాటి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరడం ఒకరకంగా సాక్ అని చెప్పాలి. మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలో స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన పార్టీని వీడుతూ, వైసీపీ కాంగ్రెస్ పార్టీ అధినేతను కలిసి త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. రేపల్లె టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ వీడటం కేవలం తన వ్యక్తిగత కారణాలరీత్యా రాజీనామా చేశానని చెప్పారు. అనగాని సత్యప్రసాద్ వరసగా మూడు సార్లు రేపల్లె నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014లో తొలిసారి గెలిచిన అనగాని సత్యప్రసాద్ తర్వాత 2019, 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ విక్టరీని కొట్టారు. ఈ విజయం వెనక గూడపాటి కష్టం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టారు. రేపల్లె నియోజకవర్గంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువయిందని, పార్టీ కోసం, ఆయన గెలుపు కోసం పనిచేసిన వారిని మంత్రి అయిన తర్వాత పట్టించుకోవడం లేదని గూడపాటి శ్రీనివాసరావు అనుచరులు చెబుతున్నారు. కానీ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు గూడపాటి హుందాగా చెప్పడం విశేషం. ఇక రంజుగా రాజకీయం వైసీపీ కండువా కప్పుకుని... తాజాగా రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ సమక్షంలో రేపల్లె నియోజకవర్గ టీడీపీ నేత, కాపు నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు, అనుచరులు టీడీపీలో చేరారు. జగన్ గూడపాటి శ్రీనివాసరావును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గతంలో గూడపాటి శ్రీనివాసరావు రేపల్లె నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్నారు. రేపల్లెలో పార్టీ విజయం కోసం గూడపాటి శ్రీనివాసరావు పనిచేస్తారని, వచ్చే ఎన్నికల్లో మోహన్ కు మద్దతుగా ప్రకటిస్తారని తెలిపారు. దీంతో రేపల్లె నియోజకవర్గంలోని వైసీపీలో జోష్ పెరిగింది. వచ్చే ఎన్నికల్లో రేపల్లెలో విజయం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని, గూడపాటి శ్రీనివాసరావు చెప్పారు. కాపు సామాజికవర్గం నేత వైసీపీలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో ఒకింత సంతోషం వ్యక్తమవుతుంది.

# అంతరించిపోతున్న కులవృత్తులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

-కుమ్మర కులస్తులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి.
-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్.
-ప్రతి కుమ్మరి కి 5 లక్షల రుణా సదుపాయం కల్పించాలి.
-కుమ్మర ఫెడరేషన్, కార్పొరేషన్కు ప్రతి ఏటా 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.
-రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశ్వర్లు.
-మట్టి పాత్రలు వాడుదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.
-వనపర్తి జిల్లా అధ్యక్షులు సూగుర్ రాములు.

**వనపర్తి.సమయం ప్రతినిధి :** గురువారం కుమ్మర శాలివాహన సంఘం ఘనపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కుమ్మర్ల ఐక్యత కార్యక్రమం ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మండల అధ్యక్షుడు కుమ్మరి శ్రీను అధ్యక్షత వహించారు. ముందుగా ఈదమ్మ గుడి నుండి పూజా కార్యక్రమం నిర్వహించి అక్కడి నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి సభను ప్రారంభించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్, జిల్లా అధ్యక్షులు సూగూరు రాములు. వారు మాట్లాడుతూ, సమాజంలో తరతరాలుగా మట్టిలో కళాత్మక పాత్రలు, రంజన్లు, ప్రమిదలు, కుండలు తయారు చేస్తూ పర్యావరణహితమైన సేవలు అందిస్తూ ఉన్నాం, నేడు ప్లాస్టిక్ స్టీల్ వస్తువులు ప్రవాహం అధికంగా ఉందని వీటిని వాడడం వల్ల క్యాన్సర్ షుగర్ బిపి వస్తుందని అన్నారు. వీటిని వాడకం నిషేధించి ప్రకృతిలో కుమ్మరి చేతి నుండి చేసిన కుండలను వాడడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మానవ మనుగడ అంతరించిపోకుండా కాపాడుకోవచ్చని అన్నారు. చెరువులపై ఆంక్షలు తీసుకురావడం వల్ల, వందలాది కుమ్మర కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టు ఆడుతున్నాయని అన్నారు, తెలంగాణలోని చెరువులు, మిషన్ కాకతీయ కింద పూడిక తీసిన కుంటల నుండి కుమ్మర వృత్తిదారులకు ఉచితంగా బంకమట్టిని తొవ్వుకొని రవాణా చేసుకునేందుకు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు, మైనింగ్ పోలీస్ మరియు రెవిన్యూ శాఖల వేధింపుల తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు, కుమ్మర్ల కు ఎలక్ట్రిక్ సారీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, కుమ్మర ఫెడరేషన్, కార్పొరేషన్కు ప్రతి ఏటా 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుమ్మరికి రెండు లక్షల నుండి 5 లక్షల వరకు ఉపాధి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు, చేతి వృత్తులను ప్రోత్సహించే దిశగా కుమ్మరవృత్తిని ఉపాధి గృహ పరిశ్రమగా గుర్తించి తయారు మరియు బట్టిలకు నెలకు 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి 5000 పింఛన్ సదుపాయం కల్పించాలని, వృత్తిరీత్యా ప్రమాదాలు జరుగుతే 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు, కుమ్మరు తయారుచేసిన కుండలు అమ్ముకోవడం కోసం బస్టాండు, చౌరస్తాల దగ్గర షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు, కుమ్మర కులస్తులకు రాజకీయంగా అన్ని రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. రానున్న కాలంలో కుమ్మర్ల అందరినీ ఐక్యం చేసి ప్రభుత్వాలు నుండి వచ్చే ఫలాలు అందె వరకు నిరంతరం ఉద్యమిస్తామని అన్నారు. జిల్లాలో ఉన్న కుమ్మరులు అందరు కూడా ఐక్యమత్యంతో ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో, ఉమ్మడి జిల్లా కుమ్మర సంఘం నాయకులు, శంకరయ్య, రామచంద్రయ్య, శ్రీను, నాగేష్, రఘు, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి సుగురు రాములు, జిల్లా గౌరవ అధ్యక్షులు, సూర్య వెంకటస్వామి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, మాజీ జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి పరశురాములు, యువజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు సూర్యవంశం గిరి, మహిళా సంఘం నాయకురాలు, లక్ష్మి, భవ్య, గీతాంజలి, లక్ష్మి, పుష్పలత, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా సహాయ కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా యువజన సంఘం నాయకులు, కుమ్మరి కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రధాన ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, ఆగస్టు 6:** జిల్లాలో చేపడుతున్న భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, టీజీఐఐసీ బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు తదితర ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

**మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం**

గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**భారత్‌మాల ప్రాజెక్టు భూసేకరణపై సమీక్ష**

భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అవార్డులు పూర్తయిన భూయజమానులకు పరిహారం చెల్లింపులు, మ్యుటేషన్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్షించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ చెల్లింపులను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. కొంతమంది రైతుల వివరాలు అందుబాటులో లేకపోవడంతో చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఆయా మండలాల తహసీల్దార్లు పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంతో పాటు మండల వ్యవసాయ అధికారుల సహకారంతో రైతు భరోసా జాబితా ద్వారా రైతుల వివరాలు సేకరించి పెండింగ్ చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే సేకరించిన భూములకు సంబంధించిన పరిహారాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో త్వరగా జమ చేయాలని, వివాదాస్పద భూములకు సంబంధించిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**రైల్వే లైన్ డబ్లింగ్ పనులు**

రైల్వే లైన్ డబ్లింగ్‌కు సంబంధించిన భూసేకరణలో అవార్డులు, విచారణలు, పెండింగ్ ప్రక్రియలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల అభ్యంతరాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అధికారులు స్పందిస్తూ, కొత్తపల్లిలో భూసేకరణ సమస్య దేవరకద్ర ఎమ్మెల్యే సహకారంతో పరిష్కారమైందని, కోడూరు, కోటకద్ర గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరలో పంపిస్తామని తెలిపారు. రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు పరస్పర సమన్వయంతో భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

**బ్రహ్మోస్ పరిశ్రమ భూసేకరణ**

దేవరకద్ర మండలంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమకు సంబంధించిన భూసేకరణ పనులను కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో కన్సెంట్ అవార్డుల ప్రక్రియ పూర్తయిందని, ఒక గ్రామంలో నెగోషియేషన్ రేటు ఖరారైతే మిగిలిన గ్రామాల్లో కూడా అదే విధానాన్ని అనుసరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులు, సంబంధిత అధికారులతో నెగోషియేషన్ సమావేశాలు నిర్వహించి త్వరగా నిర్ణయానికి రావాలని కలెక్టర్ సూచించారు. సర్వే పనులు దాదాపు పూర్తయ్యాయని, మార్కెట్ రేట్లు సిద్ధమైన వెంటనే ప్రతిపాదనలు సమర్పిస్తామని అధికారులు తెలిపారు.

**అమరరాజా బ్యాటరీస్ కనెక్టివిటీ**

అమరరాజా బ్యాటరీస్ కంపెనీకి జాతీయ రహదారి అనుసంధానం కోసం అవసరమైన భూసేకరణ అంశాలను కూడా కలెక్టర్ సమీక్షించారు. హెడ్ ఆఫీస్‌కు పంపిన లేఖలు, సర్వే నివేదికలు, మార్కింగ్ వివరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రోడ్డు అలైన్‌మెంట్, లేఅవుట్‌లపై ఉన్న అభ్యంతరాలను సంబంధిత సంస్థ ప్రతినిధులతో చర్చించి పరస్పర అంగీకారంతో పరిష్కరించాలని, అవసరమైతే ప్రజాప్రతినిధులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. టీజీఐఐసీ అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణను వేగవంతం చేయాలని, ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు లేని సుమారు 63 ఎకరాలను అడ్వాన్స్ పొజిషన్ ద్వారా వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఎం.జి.కె.ఎల్.ఐ. ప్రాజెక్టు**

మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ, అవార్డుల జారీ, పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. డిక్లరేషన్లు, పెండింగ్ అవార్డులను నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీలతో సమన్వయం చేసుకొని భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**ఉదండపూర్ ఆర్‌అండ్‌ఆర్ పనులు**

ఉదండపూర్ రిజర్వాయర్ పునరావాసం, పునర్నిర్మాణం (ఆర్‌అండ్‌ఆర్) పనులపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పెండింగ్ అవార్డులు, పరిహార చెల్లింపులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియలో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి జాప్యం లేకుండా పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, ఆర్డీఓ నవీన్, జాతీయ రహదారుల శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి క్యాంటీన్‌లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారమే అందించాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, ఆగస్టు 6 (సమయం ప్రతినిధి):** కలెక్టర్ కార్యాలయంలోని మహిళా శక్తి క్యాంటీన్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. గురువారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడారు. అందిస్తున్న ఆహారం నాణ్యత ఎలా ఉందని, ఏవైనా ఇబ్బందులు లేదా ఫిర్యాదులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. ఆహార నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా లేదా నాసిరకం ఆహారం అందిస్తున్నట్లు తేలినా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. క్యాంటీన్ నిర్వహణలో పరిశుభ్రత, ఆహార నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నా ఘన నివాళులు

దేవరకద్ర : తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) మాట్లాడుతూ...బితెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ లిజయశంకర్ ఆయన ఒక వ్యక్తి మాత్రమే కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని శాస్త్రీయంగా, సామాజికంగా ప్రజలకు వివరించి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి. ఆయన చూపిన మార్గం, ఆయన ఆశయాలు ప్రతి తెలంగాణ వాసికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, జయశంకర్ కలలు కన్న సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం సాధించే దిశగా మనమంతా కృషి చేయాలి. ఆయన విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నా ఘన నివాళులు అర్పిస్తున్నాను. ఆయన ఆశయాల సాధనకు మనమంతా అంకితభావంతో ముందుకు సాగుదాం అన్నారు.

## సిటీలో ఈవీ చార్జింగ్ సిస్టమ్

హైదరాబాద్ : భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వాలు సబ్సిడీలతో ప్రోత్సహిస్తున్నప్పటికీ, ప్రధాన రహదారులు, హైవేలపై ఛార్జింగ్ స్టేషన్ల కొరత ఈవీ వినియోగదారులకు పెద్ద సవాలుగా మారింది. దీనికి పరిష్కారంగా తెలంగాణలో దేశంలోనే తొలిసారిగా ఇథనాల్ ఆధారిత ఈవీ ఛార్జింగ్ సిస్టమ్‌ను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో ప్రారంభించారు. సాంప్రదాయ విద్యుత్ గ్రిడ్‌పై ఆధారపడకుండా పనిచేసే ఈ సాంకేతికత, దేశీయ క్లీన్ ఎనర్జీ రంగానికి, బయోఫ్యూయల్ వినియోగానికి సరికొత్త దిశను చూపిస్తోంది.సాధారణ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ల నిర్వహణకు హై-వోల్టేజ్ పవర్ గ్రిడ్లు, విస్తృత విద్యుత్ కనెక్షన్లు అవసరం ఉంటుంది. కానీ ఈ కొత్త 150ఎచి ఫాస్ట్ ఛార్జింగ్ సిస్టమ్ ఇథనాల్‌ను ఇంధనంగా వాడుకుని అక్కడికక్కడే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆ విద్యుత్‌తో వాహనాల బ్యాటరీలను అత్యంత వేగంగా ఛార్జ్ చేస్తుంది. దీనివల్ల భారీ పవర్ గ్రిడ్లతో లేదా విద్యుత్ లైన్లతో సంబంధం లేకుండా ఛార్జింగ్ సేవలు అందిస్తుంది.సాధారణ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల సమీకరణ, ట్రాన్స్‌మిషన్ లైన్లు, ప్రభుత్వ అనుమతులు, ట్రాన్స్‌ఫార్మర్ల అమరికకు నెలల సమయం పడుతుంది. అయితే ఈ ఇథనాల్ మొబైల్ ఛార్జింగ్ యూనిట్‌ను కేవలం 72 గంటల్లో (మూడు రోజుల్లో) ఎక్కడైనా సిద్ధం చేయవచ్చని కంపెనీ తెలిపింది. దీనివల్ల ప్రాథమికన్ఫ్రాస్ట్రక్చర్ ఖర్చు మరియు సమయం దాదాపు 50 శాతం వరకు తగ్గుతాయి. హైవేలపై ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ వినూత్న సాంకేతికత వల్ల దేశీయ వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గొప్ప ప్రయోజనం చేకూరనుంది. ఇథనాల్‌ను చెరకు, మొక్కజొన్న, వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారు చేస్తారు కాబట్టి, దీని వినియోగం పెరిగితే రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా పంటలకు మంచి ధర దక్కుతుంది. అలాగే ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటం తగ్గి, భారీగా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందివిద్యుత్ అందుబాటులో లేనప్పుడు వాడే డీజిల్ జనరేటర్ల కంటే ఈ ఇథనాల్ సిస్టమ్ అత్యంత పర్యావరణ అనుకూలమైనది. ఇది కార్బన్ ఉద్గారాలను దాదాపు 80 శాతం వరకు తగ్గిస్తుంది. వాహనంపై సులభంగా తరలించగల ఈ మొబైల్ ఛార్జర్, హైవేలపై అత్యవసర పరిస్థితుల్లో బ్యాటరీ ఖాళీ అయిన కార్లకు అక్కడికక్కడే ఛార్జింగ్ సేవలు అందించి ఆదుకుంటుంది. మొత్తానికి ఈ ఇథనాల్ ఛార్జింగ్ పరిజ్ఞానం గ్రీన్ మొబిలిటీ, భారతీయ వ్యవసాయ రంగాలలో ఒక విప్లవాత్మక మార్పుగా నిలవనుంది.సాధారణంగా ఫాస్ట్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ను నడపడానికి భారీ పవర్ గ్రిడ్, హై-వోల్టేజ్ విద్యుత్ కనెక్షన్ అవసరమని తెలుస్తోంది. తెలంగాణలో ప్రవేశపెట్టిన ఈ 150ఎచి ఫాస్ట్ ఈవీ ఛార్జర్ ఈ పాత పద్ధతికి పూర్తిగా స్వస్తి పలుకుతుంది. ఈ సిస్టమ్ లోపల ఇథనాల్ నుండి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఒక ప్రత్యేక యంత్రం అమర్చి ఉంటుంది. ఈ యంత్రం మొదట బయోఫ్యూయల్ అంటే ఇథనాల్‌ను ఉపయోగించి అక్కడికక్కడే విద్యుత్‌ను తయారు చేస్తుంది. ఆ తర్వాత అలా ఉత్పత్తి చేసిన విద్యుత్‌తో వాహనాల బ్యాటరీలను ఛార్జ్ చేస్తుంది. అంటే ఇది వాహనానికి లభించే విద్యుత్ సోర్స్ మారుస్తుంది, దీనివల్ల గ్రిడ్ తో ఉండే సమస్య తీరుతుంది.

## గుడివాడలోకి కొడాలి ఎంట్రీ

విజయవాడ : మాజీ మంత్రి కొడాలని రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలకం అయ్యారు. వైసీపీ అధినేతను కలవడం, ప్రభుత్వాన్ని విమర్శించడం వంటి పరిణామాలతో ఆయన గుడివాడ రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ మోడ్‌లోకి వచ్చారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో ఇటీవల కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు.కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.గుడివాడ రాజకీయాల్లో మళ్లీ తన మార్క్ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. గుడివాడలోవరసగా గెలిచిన కొడాలి నాని గత ఎన్నికల్లో కూటమి గాలిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యం బాగా లేక హైదరాబాద్ కే పరిమితమయ్యారు.కొడాలి నాని పై అనేక కేసులు నమోదయ్యాయి. అప్పుడప్పుడు గుడివాడకు రావడం పోలీసు స్టేషన్ కు వచ్చి హాజరు కావడం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోతున్నారు. అలాంటి కొడాలి నాని తిరిగి గుడివాడలో వైసీపీ బలోపేతానికి ఆయన సిద్ధమయ్యారని తెలిసింది. మొన్నా మధ్య కొడాలి నాని తన రాజకీయ వారసుడిగా తన సోదరుడి కుమారుడిని ప్రకటించారు. తన రాజకీయ వారసుడిగా తన తమ్ముడి కుమారుడైన కొడాలి అర్జున్ పేరును ప్రకటించారు. నానికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారికి రాజకీయాలపై ఆసక్తి లేకపోవడంతో సోదరుడి కుమారుడిని వారసుడిగా ఎంపిక చేశారు. రాజకొడాలి అర్జున్ 2029 ఎన్నికల్లో కొడాలి నాని స్వయంగా గుడివాడ బరిలో నిలవనుండగా, ఆ తర్వాత 2034 ఎన్నికల్లో అర్జున్ రాజకీయ రంగప్రవేశం చేస్తారని స్పష్టమైందిస్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండగా కొడాలి నాని మళ్లీ యాక్టివ్ అయ్యారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసి పనిచేయాలని సూచించారు. కేసులు పెట్టి జైల్లో వేస్తే నెల లేదా ఆరు నెలలు ఉంటామని, తర్వాత బయటకు వస్తామని కొడాలి నాని అన్నారు.






OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085